క్లుప్తంగా

వీధి వ్యాపారులు నమోదు చేసుకోవాలి

• కమిషనర్ ప్రసాదరావు



మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం: పట్టణ వీధి వ్యాపారుల పాలసీలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారం చేస్తున్నవారు తప్పనిసరిగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, మెప్మా ఆర్పీలకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారం చేస్తున్న స్థానిక, స్థానికేతరులు తమ వివరాలు సర్వే సిబ్బందికి అందించాలన్నారు. సర్వే సమాచార సేకరణపై ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 20వ తేదీలోగా సమాచార సేకరణ, ఆన్‌లైన్ ప్రక్రియ ముగించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ కమిషన్ మేనేజర్ ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న ఉగ్రసేను

శ్రీకాకుళం అర్బన్: సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పత్రిక, పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు. నగరంలోని బలగ హడ్కో కాలనీ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం పిల్లల చేత ప్రముఖుల జీవిత చరిత్రపై ఉపన్యాసాలు చెప్పించారు. తదుపరి రాజేశ్వరరావు మాస్టర్, గ్రూప్-2 విజేత అభ్యర్థి వాన శరత్ కుమార్ పిల్లలకు టెక్ట్స్ బుక్స్, లెక్కలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ హరికృష్ణ

రణస్థలం: సముద్ర తీరం వెంబడి ఉగ్రవాదులు, ఇతర దేశాలకు చెందిన వ్యక్తులు వచ్చే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వాడపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ సూచించారు. మండలంలోని అల్లివలస, జగన్నాథపురం గ్రామంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీరం వెంబడి నిషేధిత వస్తువుల అక్రమ రవాణా చేసినట్లు గుర్తిస్తే తక్షణమే స్పందించి స్థానిక, కోస్టల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1093 లేదా కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ 93929 14712 నంబర్‌కు తెలియజేయవలసిందిగా కోరారు.

విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్ముతున్న వారిపై విద్యాశాఖ అధి కారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ బోర గోపి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ప్రతీ ఒక్క ప్రైవేటు పాఠశాల యాజమాన్యం పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు, షూ పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే ఇటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ అమ్మకాలు ఆపకపోతే విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఈనెల 12వ తేదీ ఉదయం నుంచి తన 19 ఏళ్ల కుమార్తె కనిపించడం లేదని బొంతలకోడూరుకు చెందిన మహిళ ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. 11వ తేదీ రాత్రి ఇంటి వద్ద నిద్రించిన కుమార్తె సోమవారం ఉదయం నుంచి కనిపించటం లేదని ఫిర్యాదులో పేర్కొంది. యువతి శ్రీకాకుళం పట్టణంలో బీఎస్సీ నర్సింగ్ రెండో ఏడాది చదువుతోంది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యమివ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు అన్నారు. బొంతలకోడూరు పంచాయతీ లావేటిపేటలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు నవధాన్యాలు సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు.

నిర్వహణ భారం.. ఆశయానికి దూరం



కేశవరావుపేటలోని చెత్త సంపద కేంద్రం

• నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
• నిర్వహణను గాలికొదిలేసిన వైనం
• గ్రామాల్లో అపారిశుద్ధ్యం

మండలం	పంచాయతీలు	మంజూరైన కేంద్రాలు	పూర్తయినవి	అసంపూర్తిగా ఉన్నవి
ఎచ్చెర్ల	26	26	23	3
లావేరు	33	33	26	7
రణస్థలం	32	32	25	7
జి.సిగడాం	31	31	22	9

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. వాస్తవానికి పారిశుద్ధ్య నిర్వహణలో చెత్త సంపద కేంద్రాలు కీలకం. అయితే నిర్వహణ మాత్రం సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ప్రకటనలు నీటిమూటలుగా మారుతున్నాయి. ఫలితంగా గ్రామాల్లో అపారిశుద్ధ్యం విలయతాండవం చేస్తోంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో మొత్తం 122 పంచాయతీలు ఉండగా, ఎక్కువ గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్నిచోట్ల ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. చెత్త సంపద కేంద్రంలో తడి, పొడి చెత్తలు వేర్వేరుగా నిర్వహిస్తారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు యంత్రాల సాయంతో పిండి చేస్తారు. సిమ్మెంట్, తారురోడ్డు వంటి నిర్మాణాల్లో ఈ పిండి వినియోగిస్తారు. తడి చెత్త ఎరువుగా తయారు చేసి వ్యవసాయం చేసే రైతులకు అమ్మాలి. అయితే ఈ తయారీకి ఖర్చు ఎక్కువగా అవుతోంది. దీంతో ఎరువు తయారు చేసినా, అధిక ధరకు కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు.

నిర్వహణ భారం



చెత్త సంపద కేంద్రాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నది. తడి చెత్తతో సంపద తయారీకి ఖర్చు ఎక్కువవుతోంది. ఈ ధర చెల్లించి ఎవరూ ఎరువు కొనుగోలు చేయరు. నిర్వహణ అన్నది పంచాయతీలకు ఆర్థిక భారం.

– దొంక వెంకటరమణ, చిలకపాలేం

ప్రత్యేక నిధులు అవసరం



చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక నిధులు అవసరం. నిధులు కొరత ఉన్న పంచాయతీల్లో నిర్వహణ సాధ్యం కాదు. పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహణపై శిక్షణ ఇవ్వడం, నిధులు మంజూరు చేయడం చేస్తేనే నిర్వహణ సాధ్యమవుతుంది.

– నేతింటి యమున, సర్పంచ్, పొన్నాడ

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. ప్రభుత్వ నిబంధనలు మేరకు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుంది. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ, కేంద్రంలో నిర్వహణ వంటి వాటిపై పంచాయతీలు దృష్టి పెట్టాలి. కేంద్రాలను సక్రమంగా వినియోగించుకుంటే సంపద సృష్టించవచ్చు.

– పీవీఎస్ రామ్మోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎచ్చెర్ల

బుద్ధుని స్ఫూర్తి విశ్వశాంతికి దిక్సూచి



బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మానవ వికాసానికి దోహదపడిన గౌతమ బుద్ధుడి స్ఫూర్తి విశ్వశాంతికి దిక్సూచిగా నిలుస్తుందని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. గౌతమ బుద్ధుడి జయంతి పురస్కరించుకొని నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరంలో బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా బుద్ధుడి బోధనలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. బుద్ధుడు చూపించిన మార్గంలో తమ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మహనీయులందరూ ముందడుగు వేశారన్నారు. కార్యక్రమంలో కె.వి.వి.ఎస్.వర్మ, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, బొడ్డేపల్లి దామోదరరావు, పందిరి అప్పారావు, జేసీస్ ప్రతినిధులు అనిల్, బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి, గాంధీ మందిర ప్రతినిధులు బరాటం లక్ష్మణరావు, కె.అప్పారావు, పెంకి చైతన్యకుమార్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్యాలయం పరిధిలో ప్రజలకు తాగునీరు, విద్యుత్ వంటి కీలకమైన సేవలు అందిస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని మున్సిపల్ ఇంజినీరింగ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సతీష్‌లు అన్నారు. రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా 7వ రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇంజినీరింగ్ కార్మికుల శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, వారి శ్రమను దోచుకుని చాలీచాలనీ జీతాలివ్వడం సమంజసం కాదన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సమస్యలు పరిష్కరించాలని కోరారు. టెక్నికల్, నాన్-టెక్నికల్ వారి జీతాలు పెంచి ఇవ్వాలని, సీనియర్టీ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలని, వారసులకు ఉపాధి కల్పించాలని, తగినంత మంది ఇంజినీరింగ్ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీను, ముకేష్ బాబు, కిషోర్ బాబు, కె.సింహాచలం, గిరిజా శంకర్, బి.మణి, బాలవర్ధరాజు, వెంకటేష్, బలరామ్, శంకరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

శ్రీకాకుళం అర్బన్: వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, శ్రీకాకుళం జిల్లా ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు సూచించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ 102 ఆధ్వర్యంలో వేసవిలో డీహైడ్రేషన్ నుంచి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తగినంత నీరు, చల్లని ప్రదేశాల్లో ఉండడం, బయటకు వెళ్లే ముందు తలపై టోపీ ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రతీ ఒక్కరూ విధిగా రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలని, వేసవి తీవ్రత దృష్ట్యా 60 ఏళ్లు వయస్సు దాటినవారు వాకింగ్, జాగింగ్ తగ్గించాలని పేర్కొన్నారు. అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు శాసపు జోగినాయుడు, గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి.నారాయణరావు, గుడ్ల గోపాలరావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాద్‌రావు, సుగంధం సంజీవరావు, గేదెల లక్ష్మి, నందిగామ కామేశ్వరరావు, గీత, బరాటం శ్రీనివాస్, గోలీ ఉమామహేశ్వరరావు, ఎండ మోహన్, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

పంచాయతీ రిజర్వ్ స్థలాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రఘురామ్

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలో విలువైన పంచాయతీ స్థలం ఆక్రమణలకు గురయ్యిందని, అధికారులు కాపాడాలని సభ్యులు అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. రిజర్వ్ స్థలంపై ఇప్పటికే పనులు నిలిపివేశామని, హైకోర్టు తీర్పును పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎం.చక్రవర్తి తెలియజేశారు. పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నారని, అయితే ఎవరూ నిర్వహణ చేస్తారని పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. రోడ్డుపక్కనున్న విద్యుత్ లైన్ల కోసం ఇష్టానుసారంగా చెట్లు కొట్టేస్తున్నారని ఆర్అండ్‌బీ, ఉపాధి హామీ, విద్యుత్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. రామచంద్రాపురంలో జగనన్న కాలనీ కోసం పట్టాలివ్వడం జరిగిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో హౌసింగ్ యాప్‌లో కన్పించడం లేదని, లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి కోరారు. ఇదిలా ఉండగా ప్రజలకు అవసరమైన ఇరిగేషన్, విద్యాశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, కార్యాలయ ఏవో రఘు, వైస్ ఎంపీపీలు అరవల శార్వాణి, అందవరపు రామలక్ష్మి, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, తమ్మిన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో సిక్కోలు హవా



ప్రశంసాపత్రాలతో బాడీ బిల్డర్లు విజయ్, అవినాష్

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు సత్తా చాటారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి వేదికగా ఈనెల 12వ తేదీన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన వి.వి జయకుమార్ 80 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం, హరిపురానికి చెందిన కొండా అవినాష్ 60 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన వీరిని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాడపల్లి శ్రీనివాసరావు, స్వామి, రమేష్ రాజ్‌కుమార్, అశోక్, జనార్దన్, మనోహర్ ఈశ్వర్, శ్రీకాకుళం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, కె.గౌరీశంకర్, గోపాల్, ప్రసాద్, సూరిబాబు తదితరులు అభినందించారు.

దళితులను బహిష్కరించడం సరికాదు



ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గుడ్లూరు మండలం దుప్పలపాడు గ్రామంలో దళితులను గ్రామంలో తాగునీరు, వ్యవసాయ ఉపాధి పనులు లేకుండా సాంఘిక బహిష్కరణ చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కూరు ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలిగా, కూటమి ప్రభుత్వంలో హోం మినిస్టర్‌గా దళిత కులానికి చెందిన మహిళ ఉన్నప్పటికీ దళితులకు రక్షణ లేకపోవడం అన్యాయమన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించాలని కోరారు.

రక్తదానం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవి శంకర్ గురూజీ జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది టి.సుధారాణి మాట్లాడుతూ కరోనా తర్వాత రక్తదాతలు తగ్గడం బాధాకరమని, ఇలాంటి పరిస్థితుల్లో అవకాశమున్నవారందరూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీడీసీ సభ్యులు బీవీ రవిశంకర్, పెంకి చైతన్య కుమార్, కొఠారి ఆదినారాయణ, వి.సచ్చన్, టి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి ప్రేమ వాహిని అనే దివ్యరథం కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు భారతదేశమంతటా అన్ని రాష్ట్రాల్లో ప్రయాణిస్తుందని సత్యసాయి సేవా సంస్థల ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పెద్ద మందిరంలో ఆయన మాట్లాడుతూ సత్యసాయి ప్రేమ రూపాన్ని దేశమంతటా ప్రవహింపజేయడానికి ఈ రథోత్సవం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రేమ, ఆధ్యాత్మికతను నెలకొల్పి సమాజంలో శాంతినింపి ఆనందదాయక సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పూర్వపు జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు, బోయిన నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలి

• కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
• ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మాక్‌డ్రిల్



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



గాయపడిన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: అత్యవసర, ప్రమాద సమయాల్లో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర శాఖలు సంయుక్తంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉగ్రవాదులు, బాంబు పేలుడు, ఇతర దేశాల నుంచి దాడి జరిగితే ప్రజలు ఏం చేయాలి, ఎంత అప్రమత్తంగా ఉండాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌కు ప్రమాదంపై సమాచారం ఇస్తే అక్కడ నుంచి పోలీసు, వైద్యారోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, ఏపీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రమాదాల సమయంలో ప్రజలకు ఏవిధమైన సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ శాఖకు సంబంధించిన పనులను ఆ శాఖలు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించనున్నట్లు వివరించారు. రహదారులు, భవనాలు శాఖ రోడ్లు క్లియర్ చేయడం, పైడిభీమవరం వద్దనున్న ఫార్మా కంపెనీలు గ్రామస్తులను అప్రమత్తత చేయడం నిమిత్తం సైరన్ మోగిస్తారని వెల్లడించారు. పలాసలో రైల్వేస్టేషన్‌లో ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఏవిధంగా ప్రమాదాలు సంభవించినా సహాయక కార్యక్రమాలు చేయడం జరుగుతుందని వెల్లడించారు.

అత్యవసర సమయాల్లో సహాయక చర్యలు

జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఆమదాలవలస, పలాస రైల్వేస్టేషన్లలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు స్వీయ రక్షణ పొందడం, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల వంటి ప్రభుత్వ విభాగాలు సహాయక చర్యలు చేపడతాయని తెలియజేశారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఉగ్రవాదుల దాడులు, పేలుడు పదార్థాలు ఉన్నాయన్న వచ్చిన సమాచారం మేరకు తీసుకోవాల్సిన చర్యలపై సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో చిన్న చిన్న లోపాలు గుర్తించడం జరిగిందని, లోపాలు సరిదిద్ది మరికొన్ని చోట్ల ఇలాంటి మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఆర్టీసీ ఆర్ఎం ఎ.విజయ్ కుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ, ఎస్ఎం ఎంపీ రావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..?



శ్రీకాకుళం నగరంలోని ఎంఐజీ కాలనీలో రోడ్డుకి మధ్యలో చెత్త పేరుకుపోయి డస్ట్‌బిన్ దర్శనమిస్తున్నా పట్టించుకునేవారే లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను మూడేసి రోజులకోసారి కూడా తీసుకెళ్లకపోవడంతో తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

మహిళల అవస్థలు



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం వెలుగు పరిధిలో పనిచేస్తున్న వీవోఏల ఆడిట్ సమావేశం జరిగింది. కార్యక్రమానికి శ్రీకాకుళం రూరల్ మండలంతో పాటు గార మండలానికి సంబంధించిన వీవోఏలు హాజరయ్యారు. ప్రత్యేకాధికారులుగా డీఆర్డీఏ అధికారులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన సమావేశంలో వాష్ రూమ్ లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిబ్బంది తాళాలు వేయడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియక సతమతమయ్యారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు.

– శ్రీకాకుళం రూరల్

శిక్షణ శిబిరం ప్రారంభం



శాప్ ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్, వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఈనెల 31వ తేదీ వరకు శిబిరం నిర్వహించనున్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ పుణ్యాల నరసింహ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్